# విలువలు

జి.టి. రోడ్డు మీద తురాయి చెట్టు క్రింద సూరప్పడిటీ దుకాణం ఆ వేళప్పుడు ఎప్పటిలాగే ఉంది రద్దీ లేక.

మధ్యాహ్నాం ఒంటి గంట దాటిన వేళ అవటం చేత సూరప్పడు, గల్లా పెట్టిని మనవరాలు వరహాలుకి అందించి, నాలుగు మెతుకులు కతకడానికి సత్తుగిన్నె ముందు చతికిల పడ్డాడు. పడమటికి ఉత్తరానికి ఉన్న రెండు పొడుగాటి బల్లల మీద కఱ్ఱ టేబిళ్ళకు అనుకుని కూర్చున్న గడ్డెయ్య, తల దించుకుని నిద్రపోని సూర్రాజు, వరహాలు చెప్పే మాటలు వింటున్నారు.

"కరువు రోజులొచ్చి పడినయ్ అన్నయ్యా! రూపాయి నోటుకి ఇలవ నేకపాయె. ఇక ఈ బతుకేల?" అంది వరహాలు టీ బల్ల దగ్గర సామాను సర్దుతూ.

"రూపాయి నోటు.... రూపాయి నోటు అంతన్నావు. మరి రూపాయి నోటు ఏడన్నా కన్పడతందా అంట". అన్నాడు గడ్డెయ్య.

"ఎందికి లెవ్వూ! సిరిగినయో, మాసినయో, బొక్కలు పడ్డయ్యో, కన్పడతన్నయి గదా!" అన్నాడు ఉల్లిపాయ కొరుకుతూ సూరప్పడు.

'మా బాగ జెప్పినవ్! పది రూపాయల నోటుకే దిక్కునేదు. రూపాయి కోసరం బాధ పడ్తన్నావు. రూపాయో, పది రూపాయలో ఇలవ ఉంటే గదా!" అన్నాడు సూర్రాజు తల కొద్దిగా పైకెత్తి.

'ఎందికి నేదురా సన్నాసీ! రూపాయికి ఇలవ నేకపోత మడిసి కెక్కడిదిరా ఇలవ. రూక ఉన్నాడికే ఇలవ..రూక తోటే ఇలవ... మీరంతా సిన్నోళ్లు పెపంచకం తెలియనోళ్లు. పైసతోటేరా నాయినా పెపంచకం. పైసాయే పరమాత్మ" అన్నాడు సూరప్పడు తల వంచుకునే.

"అద్గదీ మాట...ముప్పయి పైసలు జేబిలో నేందే దుకాణంలోకి రానిత్తాడా సూరప్పడు మావ". అన్నాడు గడ్డెయ్య సూర్రాజుతో, తన పొడుగాటి తలపాగా సర్దుకుంటూ...

"ఎందికి రానివ్వడ్రా గడ్డే! మావ, మావ అని జెప్పి అందరూ అరువులెట్టేసి నందికేగదరా. ఊర్ల ఉండనేక ఉన్న ఇల్లు తణకాకి జమ కట్టేసి, నాలుగు నారీలో, బస్సులో అగే ఈ ఊరి చివర రోడ్డు మీన దుకాణ మెట్టుకుంది. ఆడ బతుకునేక గదా ఈడ బతుకతంది. మీలాంటోళ్ళు గదరా తాతయ్యని దివాల్తా దీయించింది" అంది వరహాలు కోపంగా, పైట జాడించి మళ్లా వేసికుని-"ఇప్పుడా ముసలోడికి తెలస్తన్నది రూపాయి ఇలవ". అంది నడుము చుట్టూ పైటబిగిస్తూ.

"కాని మడిసికి ఇలవ ఉంది కనకనే ఈ కుంసింత సోటైనా నాయుడిప్పించినడు". అన్నాడు సూర్రాజు ఎగసెక్కేంగా. మనిషి తెల్లగ సన్నగ పొడవుగా ఉంటాడేమో మాటడుతూంటే కాస్త అటు ఇటు ఊగుతాడు. ముక్కు

పుటాలు ఎగురుతాయి అతడు మాటాడుతూంటే.

"అవున్రా! నీకంతా ఇగటాలే. అయినా నిజం నిజమే. తాటికాయ నాక్కుని ఈతకాయ యిచ్చినడు కాదా నాయుడు. రోడ్డు పక్క జాగా అడి స్వంతమేటి కాదు. కాని అతగాడెవురికీ పెటేసను ఎట్టకుండా కాపాడతన్నడని... అతగాడు దేవుడని మామను క్కోవాలే" అన్నాడు సూరప్పడు.

"నాయనా! ఈ నాటికైన తెల్సుకున్నవ్‌గదా. ఊర్ల ఉన్న ఇల్లు తణఖాలో సెల్లు కట్టుకుని, దారి పక్కన గవర్నమెంటోరి జాగా ఇచ్చినడు ఎంత పేమ. కాని ఓ మాట. నిజం ఎరికైనది గదా! సూడు మడిసికి ఇలవ ఉంది కనికనే ఈదిన పడో సంసారం గుట్టుగ సాగతుంది. ఎవురి వల్ల నంతావు" అన్నాడు సూర్రాజురెండు కాళ్లు బల్ల మీద పెట్టుకుని.

"ఎవురి వల్ల నంతావు? నాయుడనుకుంతావా? కాదు. బైరాగే. సెప్పాల్సిన వారికి సెప్పి అళ్ళకి ఈళ్ళకి జెప్పి ఈడ పాక ఏయించినడు బైరాగి. తాటి కమ్మవాడు కాదా కొట్టించి కొచ్చి బండి మీన తోలుకొచ్చింది". అంది వరహాలు. వరహాలు నిజాన్నేదిదాచదు, నిజం కాని దాన్ని అంగీకరించదు.

"ఏట్రా! నా మాటే అనుకుంటన్నారు". అంటూ చూరు దాటి లోపలికి వచ్చాడు బైరాగి తన పొడవైన శరీరాన్ని వంచుతూ.

"నీ మాట అనుక్కోని దినమున్నదా దద్దా! నివ్వు నేకపోతే మామేటైపోదుము. నాయుడికి నీకు సాటా! అనుకుంతన్నాము". అంది వరహాలు.

"మంచితనమైన, చెడ్డ తనమైనా అయిటయికి (మాట మాటికి) అనుక్కోగూడదే వరాలూ. అయిట యిటికి అనుకుంటే మంచితనం విలువ పోద్ది' అంటూ బల్ల మీద కూర్చుంటూ "ఏట్రా! ముసలోడా! తిండి అయిపోయిందేటి? మీసాలు తుడుచు కుంటన్నావు". అన్నాడు బీడీ తీసి ముట్టిస్తూ బైరాగి.

- "నువ్వు దుకానానికి వొచ్చే వేళ, నాను సేతులు కడుక్కునే వేళ. ఇందల ఇసిత్రం ఏటున్నాది?" అన్నాడు సూరప్పడు.

"విచిత్ర మేటీ లేదు గాని, పంతులు గారికి బాగులేదంట". అన్నాడు బైరాగి, ముట్టించిన బీడిని పెదవుల మధ్య నుంచి ఒక్క పీల్పు పీల్చి అవతలికి పారేస్తూ "జబ్బు బాగ ముదిరినాదంటున్నారు". అన్నాడు అక్కడక్కడ తెల్ల బడ్డ మీసాల ప్రక్కలకు సర్దుతూ, ఏభై ఏళ్ళు దాటినా అంత వయసున్న వాడిలా కనపడడు బైరాగి. మిలటరీలో పది సంవత్సరాలు పనిచేసి వచ్చినవాడు. చైనాతో యుద్ధం జరిగే రోజుల్లో యుద్ధంలో చేరినవాడు పాకిస్తాన్‌తో ఇండియాకు వచ్చిన రెండు యుద్ధాలలో నెగ్గుకొచ్చి బయటపడ్డాడు. ఉన్న ఒక్క కూతురికి పెళ్ళి చేసి పంపించేశాడు. భార్యా తనే. ఏ బాదర బందీ లేదు. ఊరి బాధలన్నీ అతనివే. ముతక చొక్కా, కాకీ పాంటూ వేస్తూంటాడు. చొక్కాకి ఎప్పుడూ బొత్తాలు పెట్టడు. గుండె మీద ఆంజనేయస్వామి బిళ్ళ ఎప్పుడూ ఇవతలికి కనపడుతూ ఉంటుంది.

''మరి వైజ్జిగం సేయించనేదా?'' అంది వరహాలు వేడి టీ గ్లాసు అతని ముందుంచుతూ.

''కరణంగారబ్బాయి మందిస్తన్నాడు గాని గుణం కన్పడతానేదు. కే.జీ ఆస్పిటల్‌కి తీసికెల్లండి అని చెప్పా మొన్నే. ఇయ్యాళ బాగా లేదని తెల్సింది. ఓ మారెల్లి చూసొద్దామని. బయలుదేరా, టీ తాగి పోదామని''. అంటూ అంత వేడి గ్లాసును అందుకుని అంత వేడి టీని గడగడతాగేశాడు బైరాగి.

''అన్నా! నీ వీడున్నావా? నీతో ఓ పని పడిందే బేగిరా!'' అంటూ సుడిగాలిలా దూసుకుంటూ వచ్చాడు చిన్రాములు.

''ఏట్రా!'' అన్నాడు బైరాగి ముప్పయి పైసలు గల్లా పెట్టి మీద ఉంచుతూ.

''సెప్తానురావే!'' అన్నాడు చిన్రాములు.

''సెప్పరా! ఏటా అరిజెంటు?'' అందుకుంది వరహాలు.

''అరిజంటే! ఆ బాబెవలో ఇశాపట్నం ఎల్తన్నాడంట. మన దుకానం కాడి కొచ్చేతలికి ఆగంగరాయి సెట్టు కింద కొచ్చి కారు కదల్నని ఆగిపోందట. డ్రైవరు కొత్తోడు. ఆడికేటి తెల్దు. ఇంజను సెడిపోనాదంటా గాబరా పడి పోతన్నాడు. బాబు ఇశాపట్నంలో ఆరిజెంటు పని, ఎనాగైనాగని మహాయిదయి పోతున్నాడు. ఈడ నారీలు దప్ప బస్సు లాగవుగదా. నాను చిన్రాములు 'ఏకేటి బయము నేదు మా బైరాగి మావున్నడు. ఆడు బస్సులు, జీవులు, కార్లు నడుపతడు. ఆడికీ సెప్పినామంటే ఆడు బాగు సేత్తాడని చెప్పినము. నీవు కసింత సూడాల. మిలట్రీ బాబుల కాడ జీపునడిపేటోడినని సెప్తావుగదా.రా. ఓపాలి'' అంది చిన్రాములు వెనక వచ్చిన సీతాలు ఎడమ చెయ్యి నడుము మీద పెట్టుకుని కుడి చెయ్యి గాలిలో తిప్పుతూ.

బైరాగి వాళ్ళిద్దరి ముఖాలు మార్చి మార్చి చూసి ''ఆ బాబు గాబరాపడ్తన్నాడో లేదో గాని మీ రిద్దరూగాబరా పడిపోతన్నారేటే!'' అన్నాడు.

''ఆళ్ళకే గాబరా! నీకు లేనట్టు. కారున్న బాబు నీకోసరం ఎదురు సూత్తన్నాడు. కారు బాగు చేస్తే! నీకు మెడలిచ్చిత్తాడు'' అని అందుకున్నాడు సూర్రాజు భుజాలెగరేస్తూ.

''డబ్బున్న బాబు లంటే నీ కెందుకురా అంత ఇది?'' అందుకున్నాడు బైరాగి.

''నాకే ఇదీ లేదు... ఎల్లెల్లు... బాగ... సుబ్బరంగా... మెకానిజం చేసీ''. అంటూ రెండు చేతులు ముణుకుల దగ్గరకేసి రెండు కాళ్ళను గుండెకి దగ్గరగా లాక్కున్నాడు సూర్రాజు.

''అది మాటకేట్రా దద్దా. రా! ఎల్దాము''. అంది వరహాలు ఆకారుని, డబ్బున్న బాబుని చూడాలని దానికి మహా ఇదిగా ఉంది.

చిన్రాములు సీతాలు ముందు నడుస్తూంటే బైరాగి బయలు దేరాడు. గడ్డెయ్య వరహాలు బైరాగి వెనుక కదులుతూంటే ''ఓరిమావా! దీన్ని ఓకారున్నాడికిచ్చి పెళ్ళి చేసిరా!'' అన్నాడు సూర్రాజు.

రోడ్డు మీద కొస్తూ గంగరావి చెట్టు వేపు చూశాడు బైరాగి. ఓ తెల్లకారు నోరు తెరుచుకుని చెట్టు కిందఉంది. గ్రేకలర్ సూట్‌లో ఓ బాబు. అతని పక్క కాకి డ్రస్‌లో ఓ నల్లటి మనిషి కనపడ్డారు బైరాగికి. కారుచుట్టూ చిన్నా పెద్ద ఓ పది మంది మూగి, కారుని కారున్న బాబుని చాల కుతూహలంగా చూస్తున్నారు.

ముందుగా చిన్రాములు పరుగెత్తు కెళ్ళి "మా బైరాగి వత్తన్నాడు" అని చెప్పాడు.

చిన్రాములు వెనక పరుగేత్తే నడకతో వెళ్ళి "ఆడేనండి మా బైరాగి మావ" అంది సీతాలు గుండె మీద నుండి పైట కొంగు జారిపోవడం కూడ గమనించకుండ.

కారున్న ఆ బాబు బైరాగిని చూచి పరిచయమున్న వ్యక్తిని పలకరించినట్టు నవ్వాడు, సీతాల్ని చూచి. అతని రిమ్‌లెస్ కళ్ళద్దాలు నవ్వాయి.

"అయ్‌గారు వైజాగ్‌లో మినిష్టర్ గార్ని ఎయిర్ పోర్టులో కలియాలని బయలు దేరారు చాల అర్జెంటు పనిమీద. నాలుగ్గంటల కల్లా ఎయిర్ పోర్టులో ఉండాలి. దారిలో ఇది ఆగిపోయింది" అన్నాడు బైరాగిని చూచి అడగకుండానే డ్రైవర్.

మణికట్టు మీదకు జారి పోయే ఖరీదైన వాచీని పైకి లాక్కుని టైము చూచుకుంటూ కంగారుగా ముఖం పెట్టాడు కారున్నబాబు.

"ఏటిట్రబులు?". అన్నాడు బైరాగి ఇంజనులోకి తొంగి చూస్తూ. డ్రైవరు కాసేపాగి" అదేదో నాకు తెలిస్తే మీదాక ఎందుకొస్తాను బాబూ! అంతదూరం నుండి వస్తూ ఇక్కడి కొచ్చి బుర్ బుర్‌మంటూ ఆగిపోయింది". అన్నాడు బైరాగికీ వినిపించేంత నెమ్మదిగా.

బైరాగి మాటాడక పోవటం చూచి అతనే మళ్ళీ అన్నాడు.

"మీరు మిలటరీలో పని చేశారని, మీకు ఈ మెకానిజం తెలుసని వీళ్ళంతా అంటున్నారు. ఇక్కడ కారు ఆగిపోవడం కొంతలో కొంత మెరుగే. మీరు తొందరగా బాగు చేస్తే మీ మేలు మరచిపోం". అన్నాడు చేతులు పట్టుకునేందు కన్నట్టు రెండు చేతులు ముందుకి చావుతూ.

"అయ్‌గారు మినిష్టర్ గారితో ముఖ్యమైన పని మీద బయలు దేరారు. టయిముకి వెళ్ళకపోతే చాల చికాకు లొస్తాయి. నాకు రాబోయే డ్రవర్ ఉద్యోగం పోతుంది. గవర్న మెంటు ఉద్యోగం". అన్నాడు నెమ్మదిగా. ఎవరి అవసరాలు వారివని అర్థం చేసికున్నాడు బైరాగి.

"సెల్పుందా?" అడిగాడు తల ఎత్తకండానే బైరాగి.

"పని చెయ్యదు". అన్నాడు డ్రైవర్.

"మంత్రిగార్ని కలియ టానికి ఇట్టాంటి కారులో బయలు దేరారేమయ్యా!" అన్నాడు సూర్రాజు. అడెప్పుడొచ్చాడో రెండు కాళ్ళూ జాడించుకుంటూ.

సూర్రాజా మాటలు కాస్త గట్టిగానే అన్నాడు.

సూట్ వాలా విన్నాడు. అతని ముఖం కందగడ్డలా అయింది. కాలుస్తున్న సిగరెట్‌ను క్రింద పడేసి బూటు కాలితో రాస్తూ.

"మీరు తొందరగా పని చేసి పెట్టండి. మేము ఊరికే చేయించుకోం. మీరు ఆలస్యం చేస్తే చాల పనులు ఆగిపోతాయి" అన్నాడు తెలుగు నేర్చుకున్న ఇంగ్లీషు వాడు మాటాడుతున్నట్టు అప్పులవాడు మా బాకీ మాకు తీర్చండి అనేమాదిరిగా. అతను మాటాడు తూంటే ఎడమ వేపు పై రెండు బంగారు పళ్లు మెరిశాయి.

"తవరు కసింత ఆ చెట్టు కింద కూర్చోండి. ఒక్క సిటంలో మరామత్తు చేస్తా". నని అతనికి చెప్పి "ఒరి దేవుడూ! బాబు గారికి కుర్చీ అట్రా! బేగిపార్రా! అని బోనెట్ కింద తల పెట్టాడు.

సూటు బాబు సీతాలు గుండెల వేపే చూస్తూండగా దేవుడు కుర్చీకోసం పరుగెత్తాడు.

రేడియేటర్ నొక సారి ముట్టుకు చూశాడు బైరాగి.

ఆయిల్ టాంకు నోసారి పరిశీలించి చూశాడు.

"బండి నో సారి స్టార్టు చెయ్యండి డ్రైవర్ బాబూ!" అన్నాడు బైరాగి.

డ్రైవర్ లోపలికెళ్ళి కూర్చుని ఇగ్నిషన్ కీ తిప్పాడు. స్టీరింగ్ అందుకున్నాడు. ఫలితంలేదు.

దేవుడు గాడ్రెజి కుర్చీ తెచ్చి చెట్టు మొదల్లో వేశాడు.

సీతాలు వేపే ఒరకంటితో చూస్తూ దేవుడు తెచ్చిన కుర్చీలో కూర్చున్నాడు సూటు బాబు ఇబ్బందిగా.

"ఆ బాబు సూత్తన్నాడు సరిగేసుకో" అంది వరహాలు. సీతాలు పక్కకి తిరిగింది.

ఎక్కడో ఎవరో కిసుక్కువ నవ్వినట్టుంటే ఏమితో చక త్రిబుల్‌ఫైవ్ సిగరెట్ నందుకుని పాకెటును పాంట్ జేబులో పెట్టుకోబోతూ "బాలయ్యా! వారు స్మోక్ చేస్తా రేమో ఇచ్చిరా!" అంటూ డ్రైవర్‌ని పిలిచి పాకెట్ సందించాడు సూట్ బాబు. వరహాలు పక్కనేకనీ కనపడకండ ఉన్న సీతాలునే చూస్తూ లైటర్‌తో సిగరెట్ వెలిగించాడు.

బైరాగి తల ఎత్తి చూచి, బాలయ్య చేతిలోని సిగరెట్ పాకెట్‌ను చూచి "నాకాడ బీడిఉందిలే. ఇచ్చిరా". అంటూ పక్క జేబు లోంచి బీడి అందుకుని బీడి వెలిగించి ఒక్కదమ్ము గట్టిగ లాగి బీడి అవతల పారేసి మళ్ళీ తల దూర్చాడు.

సీతాకాలం అవటం చేత ఎండ వెన్నెల్లా ఉంది. కోతలు అక్కడక్కడ మొదలవటం చేత రోడ్డు ప్రక్కగా ఉన్న చేలలో అక్కడక్కడ కూలిజనం కదలటం తప్ప రోడ్డు మీద నరసంచారం అంతగా ఏం లేదు. రెండు మూడు లారీలు వచ్చాయి గాని ఆగకుండ వెళ్ళి పోయాయి. ఒక నాన్ స్టాప్ బస్సు, ఒక పాసింజరు బస్సు ఒకదాని వెంట ఒకటి వెళ్ళి పోయాయి, లారీలు, మాత్రం ఉదయం పూట.

సాయంత్రాలలో సూరప్పడు దుకాణం దగ్గర ఆగి టీ తాగి పోవటం రివాజు.

బైరాగి దగ్గరగా బాలయ్య నిలబడి చూస్తున్నాడు.

"ఓ పాలి రెంచి అందుకోండి బాలయ్యగారూ" అన్నాడు బైరాగి బాలయ్య పరుగున వెళ్ళి టూల్సు కిట్ తెచ్చిపక్కన పెట్టాడు.

"ఎన్నేళ్ళ యింది డ్రైవింగ్ చేస్తూ ? " అడిగాడు బైరాగి టూల్సుకిట్‌లో తనకు కావలసి వాటిని వెతుక్కుంటూ.

"ఏళ్ళు కాదు... నెలలు". నెమ్మదిగా గొణిగాడు బాలయ్య

"మెకానిజం నేర్చుకోలే".

"బాగరాదు. అయినా ఈ బండి పాతది".

"ఈయన దగ్గరేనా ఉద్యోగం?".

"ఉద్యోగం కాదు... ఉద్యోగం వేయిస్తానని చెప్పారు... లైసెన్సు వారే ఇప్పించారు".

సూట్ బాబు నెమ్మదిగా కారు దగ్గరికి వచ్చి "కారు బాగవుతుందా? ఎంత టయిము అవుతుంది?" అన్నాడు నట్టుతూమాటాడుతూ.

"ఆయిల్ అంధటం లేదుసార్! తవరు కాసింత కూచోండి అయిపోద్ది". అన్నాడు బైరాగి తల ఎత్తకుండానే

"డిలే అవుతుందంటే బస్సులో వెళ్తాను". అన్నాడు వాచీ చూసుకుంటూ.

"ఈడ బస్సు లెవ్వి ఆగవు. ఓ మైలు దూరం పోతే ఆదోరం సంతకాడ పాసింజరు బస్సాగుద్ది. కాని పాసింజరు బస్సుల్నమ్మలేం. ఏడ కాళ్ళు బారజాపుతయో అటికే తెల్దు. సరిగా ఎల్తే రెండు గంటలు దాటుద్ది. వోయిజాగ్ చేరే తలికి నాలుగు". అన్నాడు గడ్డియ్య.

"నో!....నో!!...హా!...హా!!...." కంగారు పడుతు అన్నాడు సూటు బాబు "మినిష్టరు గారితో ఎంగేజ్ మెంటు.... హా!....హా!" అని గొణుగుకుంటూ.

"తవరు కసింత ఓర్చండి సార్! బాగవుద్ది. అసలే పాతకారు. తీగకదిల్తే డొంక కదులుద్ది అన్నట్టుంది". అన్నాడు బైరాగి తల వంచుతూ.

సూట్ బాబు మరో సిగరెట్ వెలిగించుకుని నెమ్మదిగా కుర్చీ దగ్గరికి నడిచి వెళ్ళాడు కారుచుట్టూ మూగి ఉన్న పిల్లలు దారిస్తూండగా. అతడి చూపులు గమనించింది వరహాలు". ఎల్దాములాయే. మా తాత ఒక్కడే ఉన్నడు దుకాణంలో" అంటూ సీతాల్ని వేసికొని బయలు దేరింది వరహాలు.

"ఈ పాలి స్టార్టు చెయ్యండి బాలయ్యగారూ!" అన్నాడు బైరాగి పక్కకు తప్పుకుని. బాలయ్య లోపలికెళ్ళి స్టీరింగ్ అందుకున్నాడు.

బైరాగి సన్నగ నవ్వుకుంటూ "గడ్డియ్యా! చిన్నాములూ, తవుడూ, ఓరి సన్నిగా

తలో చెయ్యి వెయ్యండ్రా!'' అన్నాడు.

''ఎనక్కా! ముందికా!'' అడిగాడు తవుడు.

''ముందికే!'' అన్నాడు బైరాగి.

''అదంతా 'అప్పే' రా అన్నా! తుమ్మసెట్టు కాడి కెల్లేంత వరకు 'అప్పే' అంత దవ్వు బండి తోయాల్నా''

''ఈ మద్దినే స్టార్టవుద్దిలేరా! అయినా అంత అప్పు లేదు.'' అన్నాడు బైరాగి భరోసా ఇస్తూ.

నలుగురు కారు వెనక్కి వెళ్ళారు.

''పట్టహే!... పట్టు... తొయ్యి... ముందుకి... అనాగ... తోసినావంటి... నాయలా!... పట్టు.... అదీ.... అద్గదీ....'' అంటూ ఒకరి నొకరు హెచ్చరించుకుంటూ తోశారు. అయిదారు బారలు తోసినా స్టార్టుకాలే.

''ఊ'' అన్నాడు బైరాగి.

ఆగిన ఆ నలుగురు మళ్ళా ముందుకి అడుగేశారు. మరో నాలుగు బారలు ముందుకెళ్ళినా లాభం లేకపోయింది.

బైరాగి దారి పక్కనున్న ఒక పెద్ద రాయిని ఎంచి ఫ్రంటు వీల్ కింద పెట్టి మళ్ళా బోనెట్ కింద తల పెట్టాడు. ''దద్దా! దద్దా!! నీ వీడున్నావా? పంతులు గార్ని ఇశాపట్నం తీసికెల్లాలంట. నిన్నో పాలి రమ్మంతన్నారు. రా రా!'' అంటూ వచ్చాడు సుడిగాలిలా నూకరాజు.

''వస్తన్న... వస్తన్న.... అయి పోయిందిలే. బాబు గారి కారుకి కసింత జొరం వస్తే...'' అన్నాడు తల ఎత్తకండానే చేతులు లోపల తిప్పుతూ.

''అదికాదురా దద్దా! అదోరం సంత కాడికెల్తేనే గాని బస్సు దొరకదు. నాయుడి గారి జీపు అడుగుదువు రా రా! ఎల్దుం'' అన్నాడు నూకరాజు బైరాగి భుజం పట్టుకుని.

ఎప్పుడు వచ్చాడో సూటు బాబు'' వస్తాడు లేవయ్యా! ఈ పని అవనీ''. అన్నాడు బైరాగి వెళ్ళి పోతాడేమోననే కంగారుతో.

''అదికాదండి బాబయ్యా! మా పంతులు గారు మాకందరికీ పంతులుగారే. ఆరికీ పానం మీనకొచ్చినాదండీ... దద్దా! రా రా! ఓపాలి''. అన్నాడు సూటు బాబుకి సమాధానం చెపుతూ.

''ఇదిగో... అయిపోయె... వస్తన్న... ఇంతకీ పంతులు గారికెట్టుందిరా?''

''మన లోకంలో లేడే దద్దా! నాయుడుగారి జీపు నేకపోతే సావుకారు బస్సు నాపించాల. నివ్వు రా రా!'' అన్నాడు నూకరాజు.

''మరట్టయితే బస్సులో ఎట్టవుద్దిరా అవదే... బాలయ్యగారూ!.... ఇగ స్టార్టు వెయ్యండి...ఓరే ఈపాలి హుషారుగా తొయండ్రా!'' అంటూ బోనెట్ మూసి పక్కకు తప్పుకున్నాడు బైరాగి.

బాలయ్య స్టీరింగ్ అందుకున్నాడు.

ఎనిమిది చేతులు కారును ముందుకు నెట్టాయి.

సూట్‌బాబు ఆత్రంగా కారును వెంబడించాడు.

తుమ్మ చెట్టు వరకు నలుగురు ఒకరి నొకరు హెచ్చరించుకుంటు తోశారు చెమటను తుడుచు కుంటూ తుమ్మ చెట్టు నుండి నాలుగు బారలు తోసే సరికి కారుస్టార్టు అయింది.

బైరాగి ప్రక్కనే ఉన్న నేల మీది గడ్డితో చేతులు తుడుచుకుంటూ " రైట్! బాలయ్యగారూ" అన్నాడు.

"థాంక్యూ! థాంక్యూ!! అంటూ సూటు బాబు ముందు కొచ్చాడు.

"దారిలో మరేట్రబులు రాదుకదా?" అన్నాడు భీతిని వ్యక్తం చేస్తూ సూటుబాబు.

"మరేట్రబులు రాదు. ఇంజను పార్టులు కొన్ని మార్చాల. వైజాగ్‌లో ఓపాలి కారును బ్రేక్‌లో ఉంచండి". అన్నాడుబైరాగి.

"థాంక్యూ!" అన్నాడు సూటుబాబు.

"ఆయిలు ఖర్చవుద్దని ఇంజను అపీకండి బాలయ్యగారు. ఖర్మగాలి దార్ల ఇంజను ఆగిపోయిందనుకోండి....."

"దద్దా! పంతులుగార్ని డోలీ కట్టితెస్తున్నారు. నీవోపాలి నాయుడిగారికి సెప్పరా! జీపిత్తారేమోనని" అంటూ మళ్లా వచ్చాడు నూకరాజు.

"ఎందికిరా.. అది జరగని మాట. అతగాడ్నడిగి లేదనించుకునేకంటే మరో చిన్నతనమేదీలేదు". అన్నాడు సూర్రాజు.

"మనం బయలు దేరుదామా?" అన్నాడు సూటుబాబు.

"అలాగేకాని... బైరాగిగారూ... కారుదార్లో అగితే... సందేహం వెలీబుచ్చాడు" బాలయ్య.

"ఆగదు లేవయ్యా!" అంటూ భరోసా యిచ్చాడు బైరాగి.

సూటుబాబు వాచీ చూచుకుని జేబులోంచి పర్సు బయటికి లాగీ అందులో నుండి 20 రూపాయల కొత్తనోటు తీసి "తీసికో". అన్నాడు.

"వద్దండిబాబు. అలా ఇవ్వకూడదండి... చాల తప్పండి... నాకు చేతనైంది నేను చేశానండి." అన్నాడు బైరాగి వెనక్కి రెండడుగులవేస్తూ.

"ఫరవాలేదు. తీసికో". అన్నాడు.

"వద్దండిబాబూ... మీదయుంటే అంతేశాన". అని "బాలయ్యగారూ!... నేను సెప్పింది గురుతుంది గదా రైట్". అన్నాడు బైరాగి.

సూట్‌బాబు కారులో బ్యాక్ సీటులో కూర్చోగానే బాలయ్య స్టీరింగ్

అందుకున్నాడు.

సూరప్పడు 'డవున్' నుండి పరుగు పరుగున వచ్చాడు.

"ఓర్నీ మతిమండిపోనూ! చేతిలో ఉన్నదాన్ని వదిలేస్తా వేరా! పంతులుగార్ని కే. జి. అస్పిటలికి తీసికెల్ల మని సెప్పరా ఆ బాబుకి. అదిగో పంతులుగోరి డోలీ వచ్చేసినాది" అన్నాడు సూరప్పడు.

బైరాగి మెదడులో ఓ వెలుగు వెలిగింది.

రెండడుగులు ముందుకు కదిలిన కారు ముందుకి పరుగెత్తి "బాలయ్యగారూ! కసింత ఆగండి... ఆగండి". అని చెప్పిబాలయ్యను చేరాడు.

బాలయ్య కారు స్లో చేశాడు.

బైరాగి వెనక డోర్ దగ్గరికి చేరి.

"బాబుగారూ! తవరు నాకో సాయం సెయ్యాల. మా పంతులుగారికి పానం మీదికొచ్చింది. అరిజెంటుగా కే.జీ. ఆస్పిటల్‌కి దీసికెల్ల మన్నారు మా కరణంగారబ్బాయి... తవరెలాగూ వైజాగ్ ఎల్తన్నారు. పంతులుగార్ని... ఆ రబ్బాయిగార్ని మీ కార్ల వైజాగ్ దాపున సేర్చితేచాలు... అట్నుంచి ఏదోలా ఎల్పోతారు... తవరు ఈ చిన్న సాయం సెయ్యాల" అన్నాడు.

సూటుబాబు ఇబ్బందిగా కారులో కదిలి

"చూడవయ్యా! నేను అర్జెంటుగా మినిష్టర్‌గార్ని కలియాలి ఎయిర్‌పోర్టు దగ్గర. కలియకపోతే మర్యాదగ ఉండదు. వారితో నాకు చాల పనులున్నాయి. నీవు చాలా సాయం చేశావు. నేను కాదనలేను. ఈ సారికి ఏమీ చేయలేను. మరోసారి తప్పక చేస్తాను... బాలయ్యా! కారు పోనియ్యి..." అన్నాడు.

బైరాగి చేతులు జోడించి-

"బాబూ! ఉపకారానికి ఉపకారం బదులు కానక్కరలేదు. కాని ఆ బాబు మన స్పృహలో లేరు. మాదో దిక్కుమాలిన ఊరు. ఇక్కడి పెద్దలు శవాన్ని పీక్కుతినే మడుసులు. ఇక్కడ ఎవరికీ జబ్బులు రాకూడదు. వస్తే కాష్టాలే దిక్కు. బాబూ... నా మాట కాదనకండి". అన్నాడు కదులుతున్న కారు వెంట నడుస్తూ బైరాగి.

"ఇలాంటి మనిషిని నేను ఎలా తీసుకెళ్ళగలనయ్యా? దారిలో ఏమైనా అయితే... సారీ! నేనేమీ చెయ్యలేను.. బాలయ్యా పద" అన్నాడు చూపు మళ్లించుకుని సూటు బాబు.

"పంతులుగారికేం కాదు బాబు. డాక్టరు సాయం కావాలంతే.

"అయినా నేనేం చేయలేను".

"అంతేనా బాబూ!" అన్నాడు బైరాగి.

"అంతే!" అన్నాడు కారున్నబాబు తలతిప్పకుండ. వెనక ఎవరో నవ్వుతున్నట్టుంటే వెనుతిరిగాడు బైరాగి.

సూర్రాజు పెళ్లున నవ్వుతు దగ్గరే ఉన్న పెద్దరాతిని రెండు చేతులతో ఎత్తాడు.

చటుక్కున బైరాగి ఆ చేతుల్ని పట్టుకున్నాడు. కారు ముందుకి పోయింది.

★ ★ ★